క్లుప్తంగా

వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీలో విద్యార్థులు

పుత్తూరు: హిందీ భాషలో ప్రావీణ్యం సాధిస్తే దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని హిందీ ఉపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. మంగళవారం మండలంలోని గొల్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో ఎం.భార్గవి ప్రథమ స్థానం, కె.హేమ నందిని ద్వితీయ స్థానం, కె.జనని తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు.. చిత్రలేఖనంలో కె.చంద్రకళ, కె.నీరజ, కె.జననీ తొలి మూడు స్థానాల్లో నిలిచినట్లు వివరించారు. విజేతలకు ఈనెల 14వ తేదీన బహుమతులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయని భారతి, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్యా వర్క్ సామగ్రి పంపిణీ



శిక్షణ పొందుతున్న మహిళలు

పుత్తూరు : చేతి వృత్తుల్లో శిక్షణతో పాటు రుణాలు పొందుతున్న మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జన్ శిక్షణ్ సంస్థాన్ కో–ఆర్డినేటర్ హరి సూచించారు. మంగళవావారం పట్టణ పరిధిలోని రాచపాళెం గ్రామంలో వారం రోజులుగా ఆర్యా వర్కుపై ఉచిత శిక్షణ పొందుతున్న మహిళలకు అవసరమైన సామగ్రి పంపిణీ చేశారు. హరి మాట్లాడుతూ రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో 84 రోజుల పాటు ఆర్యా వర్క్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు చేతివృత్తులపై మక్కువ పెంచుకుని నైపుణ్యత సాధించాలని కోరారు. కార్యక్రమంలో రాస్ అధికారి రవి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేతకు డిమాండ్



నిరసన తెలుపుతున్న యూనియన్ నేతలు

పుత్తూరు: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ, ఏఐటీయుసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు పట్టణంలో నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. లాభాలు ఆర్జిస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ పనులు ఆపకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సమయపాలన తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

పాలసముద్రం : సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, అప్పుడే ప్రజలకు నమ్మకం కల్పించగలమని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆముదాల, పాలసముద్రం, వీఆర్ కుప్పం గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలు అందించే ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన



ఎంపికైన వారితో అధ్యాపకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్సీవీ పురుషుల డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన ఉద్యోగమేళాకు విశేష స్పందన లభించింది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జేకేసీ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరిగింది. ఇందులో 7 బహుళ జాతీయ కంపెనీల హెచ్‌ఆర్‌లు హాజరయ్యారు. 114 మంది యువత ఈ ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 69 మంది ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, జేకేసీ కోఆర్డినేటర్ గిరిజ పాల్గొన్నారు.

అటు నాటు.. ఇటు బెల్టు

- ఆలపాకంలో 24 గంటలు సారా, బెల్టు షాపుల దందా
- బస్సు దిగిరావడానికి భయపడుతున్న మహిళలు
- బాటిల్‌కు రూ. 20 నుంచి రూ.50 వరకూ అదనం
- చోద్యం చూస్తున్న ఎస్‌ఈబీ అధికారులు



విజయపురం: మండలంలోని ఆలపాకంలో బెల్టు, నాటు సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎప్పుడు ఎక్కడకు కావాలంటే అక్కడకి లిక్కర్‌ను డోర్ డెలివరీ చేస్తున్నారు. ఎస్‌ఈబీ అధికారులు వీటిని నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ఆలపాకంలో బెల్టు ప్రారంభమైందని, అక్కడి మహిళలు వాపోతున్నారు. ప్రధానంగా బెల్టు షాపుల నిర్వాహకులకు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే సరుకు సరఫరా అవుతోంది. అందులో పనిచేసే కొందరు సిబ్బంది రాత్రి సమయాల్లో దుకాణం నుంచి సరుకు బెల్టు దుకాణాలకు రహస్యంగా చేరవేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బెల్టు షాపుల్లో క్వార్టర్ రూ.200 ఉంటే దానిని మందుబాబుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అదనంగా రూ.20 నుంచి రూ.50 వరకూ పెంచి అమ్ముతూ మందుబాబుల జేబులకు చిల్లు పెడుతున్నారు.

ఆలపాకం రోడ్డుపై చిన్న కొట్టు

ఆలపాకం బస్టాండు సమీపంలో ఓ వ్యక్తి చిన్న కొట్టు ఏర్పాటు చేశాడు. అందులో బీడీ, మిఠాయి, కుర్‌కురే ఇలా చిన్న చిన్న తినుబండారం విక్రయిస్తూ, మెల్లగా అందులోనే బెల్టు షాపు ప్రారంభించినట్లు మహిళలు తెలిపారు. రాత్రి పూట ప్రభుత్వం మద్యం షాపు నుంచి తెచ్చుకున్న బాటిల్స్‌ను చెరకు తోటలో దాచిపెట్టి, ఉదయం 4గంటల నుంచి 11గంటల వరకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అలాగే రాత్రి పూట మద్యం షాపు మూసివేసిన తరువాత కూడా అర్ధరాత్రి వరకు బెల్టు షాపు నడుపుతున్నారని ఆరోపిస్తున్నారు.

భయపడుతున్న మహిళలు

ఆలపాకం నుంచి బస్సు రోడ్డుకు సుమారు కిలో మీటర్ దూరం ఉంది. ఇరు పక్కల చెరకు తోటలు, బస్సు దిగి ఊరు లోపలికి వెళ్లాలంటే మహిళలు భయాందోళన చెందుతున్నారు. దీనికి తోడు చెరకు తోటలో బెల్టు షాపు, నాటుసారా విక్రయించడంతో మహిళలు మరింత భయాందోళనకు గురవుతున్నారు. మద్యం ప్రియులు, రాత్రీపగలు తేడా లేకుండా అక్కడే తిరుగుతుండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియక భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్టు షాపు నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే విలయం

- ముందస్తు హెచ్చరికలు లేకపోవడంతోనే ఘోరం
- విజయవాడ విపత్తుకు సర్కారే కారణం
- మాజీ మంత్రి ఆర్‌కే రోజా



మాట్లాడుతున్న మాజీ మంత్రి రోజా

నగరి : ప్రభుత్వం వైఫల్యంతోనే విజయవాడ ప్రజలకు ఇంతటి దుస్థితి దాపురించిందని మాజీ మంత్రి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వరద ఉధృతిపై ముందస్తు హెచ్చరికలు చేయకపోవడంతోనే ఇంతటి ఘోరం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, వరదలకు సంబంధిత హెచ్చరికలను వాతావరణ శాఖ, నీటిపారుదల విభాగం ముందస్తుగా ప్రభుత్వానికి తెలియజేస్తుందన్నారు. అలాంటి సమయంలో వెంటనే ప్రజలను అప్రమత్తం చేయాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని రక్షిత ప్రదేశాలకు ఎందుకు తరలించలేకపోయారని మండిపడ్డారు. కనీసం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న వారిని ఖాళీ చేయించే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. దీంతోనే 50 మంది మృత్యువాత పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాగోలా ప్రాణాలు రక్షించుకున్న కుటుంబాలకు నీరు, ఆహారం, పిల్లలకు పాలు కూడా సక్రమంగా సరఫరా చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఇల్లు, ఏబీఎన్ రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్‌ను రక్షించుకునేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీ దకు వదిలేశారని ఆరోపించారు. వర్షం, వరద తగ్గుముఖం పట్టిన తర్వాత కూడా కనీస వస తులు లేక ఎనిమిది రోజుల పాటు లక్షల మంది ప్రజలు నరకయాతన అనుభవించడం దారుణమన్నారు. రాష్ట్ర రాజధానిగా చెప్పుకునే విజయవాడలోనే ఇలా ఉంటే.. ఇక సాధారణ గ్రామాల్లో ఉన్నవారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తన వెంట అధికారులను వేసుకుని తిరగడం తప్ప వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించి పర్యవేక్షించే ప్రయత్నం చేయలేదని విమ ర్శించారు. అయితే రోజా ప్రెస్‌మీట్‌లు పెట్టి ఏదో చేసేస్తున్నట్లు భ్రమలు కల్పిస్తున్నారని స్పష్టం చేశారు.

85 జీఓ రద్దు చేయకుంటే 'దీక్ష'



మాట్లాడుతున్న వైద్యాధికారి హేమశ్రీ

కార్వేటినగరం : ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 85తో వైద్య సిబ్బంది విధులకు ఆటంకమని, ఈ జీఓను వెంటనే రద్దు చేయకుంటే దీక్షకు దిగుతామని మంగళవారం కత్తెరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి హేమశ్రీ స్పష్టం చేశారు. ఈ జీఓ కారణంగా తన 3 ఏళ్ల సర్వీస్‌కు అర్థం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా ఈ జీఓ రద్దు కోసం వినతులు సమర్పిస్తున్నా ఫలితం కనిపించడం లేదని మండిపడ్డారు. కోవిడ్ కాలంలో ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలు అందించిన వైద్యులపై కక్ష సాధించడం మంచి కాదని తెలిపారు. ఈ జీఓకు వ్యతిరేకంగా 10న నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామన్నారు. 11 నుంచి 12వ తేదీ వరకు రెండు రోజుల పాటు సేవలకు అంతరాయం లేకుండా నిరసన కొనసాగించనున్నట్లు వెల్లడించారు. .13వ తేదీన అత్యవసర సర్వీసులను మినహాయించి అన్ని అధికారిక కమ్యూనికేషన్‌లు నిలిపివేస్తామన్నారు. 15న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే 16వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

'శుభ్‌దిన్ భోజన్'కు విశేష స్పందన



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం : శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమానికి దాతల నుంచి విశేష స్పందన వస్తోందని డీఎం పురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులు తెలిపారు. మంగళవారం ఈ మేరకు పాఠశాలలో శుభ్‌దిన్ కింద పిల్లలకు రుచికరమైన భోజనం వడ్డించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమానికి దాతలు అధిక సంఖ్యలో ముందుకు వస్తున్నారని వెల్లడించారు. మంగళవారం మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ, పూర్వ విద్యార్థి శేషాద్రి తన సొంత నిధులతో పౌష్టికాహారం పంపిణీ చేశారన్నారు. దాత శేషాద్రి మాట్లాడుతూ పేద పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిత, సరస్వతి, మాలతి, సుమతి, తిరుమలరాజు, ఢిల్లీబాబు, చిన్నయ్యశెట్టి, రంజిత్‌కుమార్, రాములు, పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ సంధ్య పాల్గొన్నారు.

ముత్తుమారియమ్మకు అభిషేకం



విశేషాలంకరణలో ముత్తు మారియమ్మ

పాలసముద్రం : మండలంలోని అలిమేలు మంగాపురంలో నూతనంగా ప్రతిష్ఠించిన ముత్తు మారియమ్మకు మంగళవారం వైభవంగా అభిషేకం నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు పిండి దీపాలు వెలిగించి మాంగల్య పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఘనంగా పుట్టలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శ్రీరంగరాజపురం : మండలంలోని వీవీ పురంలో గ్రామ దేవత కట్టుపుట్టలమ్మ గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. గంగమ్మను నడివీధిలో కొలువుదీర్చి అంబలి, పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులు వివిధ వేషాలు ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, నాయకులు దాము నాయుడు, డిశంబర్‌శెట్టి, మార్కొండయ్య, శ్యామ్, యుగంధర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పాఠశాలల నిర్వహణ



రికార్డులు పరిశీలిస్తున్న మానిటరింగ్ అధికారి

నగరి : ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా పాఠశాలలను నిర్వహించాలని రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ట్రెనింగ్, ప్రోగ్రామ్) కల్పన శైలజ స్పష్టం చేశారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని కరకంఠాపురం ప్రాథమిక పాఠశాల, అడవి కొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల, కీళపట్టు బీసీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలల్లో టీచింగ్ ఎట్ రైట్ లెవల్ (టీక్యూర్‌ఎల్) అమలు తీరును పరిశీలించారు. కీళపట్టు బీసీ కాలనీ పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు లోకేష్‌ను అభినందించారు. కరకంఠాపురం ప్రాథమిక పాఠశాల నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, టీక్యూఆర్‌ఎల్ జిల్లా కో–ఆర్డినేటర్ లోకనాథం, జీసీడీఓ ఇంద్రాణి, సీఎంఓ ఉదయలక్ష్మి, ఏఎస్‌ఓ నరోత్తమ రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక సేవకుడి మృతి



గిరిధర్‌రెడ్డి (ఫైల్)

శ్రీరంగరాజపురం : చిన్నతయ్యూరు గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు ఎస్ఎస్ గిరిధర్‌రెడ్డి మంగళవారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రిని పంపిణీ చేసేవారు. అలాగే మండలంలోని రోడ్లకు ఇరువైపులా సొంత నిధులతో మొక్కలు నాటించేవారు. దళితవాడకు చెందిని ఇద్దరు పేద విద్యార్థులను సైతం చదివిస్తున్నారు. గిరిధర్‌రెడ్డి మరణవార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పుష్పమ్మ కుటుంబానికి పరామర్శ



పుష్పమ్మ కుటుంబీకులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం : మండలంలోని వావిల్‌తోటలో గుండె పోటుతో మృతి చెందిన దేవరగుడిపల్లె మాజీ ఎంపీటీసీ సభ్యులు బోడిరెడ్డి పుష్పమ్మ కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి పరామర్శించారు. మంగళవారం గ్రామానికి వెళ్లి పుష్పమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబీకులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీటీసీ సభ్యులు హరి, చిన్నబ్బ, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ ఎంపీపీ పురుషోత్తం, రైతు విభాగం మండల అధ్యక్షుడు ఉమాచంద్రారెడ్డి, యువత అధ్యక్షుడు గణపతి రెడ్డి, యువత మాజీ అధ్యక్షుడు నరేష్ రెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్ ప్రకాష్ ఉన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు హరికృష్ణ, భీమశంకర్‌రెడ్డి, గురవారెడ్డి, పార్టీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్ సైతం పుష్పమ్మకు నివాళులు అర్పించారు.

క్రికెట్ టోర్నీ విజేత తయ్యూరు

శ్రీరంగరాజపురం : మండలంలోని దళవాయిపల్లెలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పెద్దతయ్యూరు జట్టు విజేతగా నిలిచింది. రూ.,50 వేలు నగదు బహుమతితో పాటు కప్ అందుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సూరి, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ,సురేష్ అవార్డులు అందుకున్నారు. విజేత జట్టును సర్పంచ్ వరదమ్మ ఘనంగా సత్కరించారు.



ట్రోఫీతో విజేత జట్టు

నేడు గంగమ్మ జాతర



సప్తకన్యక అలంకరణలో ఓరుగుంటాలమ్మ



విద్యుద్దీపాలతో అమ్మవారిక కటౌట్



మహిషాసుర మర్దినిగా దేశమ్మ దేవత

నగరి : పట్టణంలో బుధవారం గంగమ్మ జాతర నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచే గంగమ్మ కొలువుదీరే ప్రాంతంతోపాటు, దేశమ్మ, ఓరుగుంటాలమ్మ ఆలయాల వద్ద మహిళలు భారీ సంఖ్యలో పొంగళ్లు పొంగించారు. ఈ క్రమంలో ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు. విద్యుత్‌దీపాలతో అలంకరించారు. టీటీడీ ఆధ్వర్యంలో భారీగా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. నగరి జాతర సందర్భంగా గంగమ్మకు టీటీడీ వారు చలువపందిళ్లు, శ్వేతవస్త్రాలు, పుష్పాలు అందించే సంప్రదాయానికి గత ఏడాది మాజీ మంత్రి ఆర్‌కే రోజా నాంది పలికిన విషయం విధితమే. జాతర నిర్వహణ ప్రాంతాన్ని సీఐ మహేశ్వర్ సిబ్బందితో పాటు పరిశీలించారు. బందోబస్తుపై జాతర కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ క్రమంలోనే నగరి గ్రామదేవతల్లో అక్కచెల్లెళ్లుగా చెప్పుకునే ఓరుగుంటాలమ్మ, దేశమ్మ ఊరి మధ్యలో నిర్వహించే జాతర ప్రాంతంలో కొలువుదీరారు. ఓరుగుంటాలమ్మ సప్తకన్యక అవతారంలోను, దేశమ్మ దేవత మహిషాసుర మర్దిని రూపంలోను దర్శనమిచ్చారు.

వైభవంగా గ్రామదేవతల ఉత్సవాలు



ఇనుప కొక్కీలకు వేలాడుతున్న భక్తులు

నగరి : స్థానిక కేవీపీఆర్ పేట, ఏకాంబరకుప్పం గ్రామదేవతలు పొన్నియమ్మ, ఎల్లమ్మ, తొప్పయమ్మ ఉత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం పసుపు వస్త్రాలు ధరించిన భక్తులు నది నీటిని బిందెలతో తీసుకుని తలపై పెట్టుకొని ఊరేగింపుగా బయలుదేరారు. నోటికి గుడ్డలు కట్టుకొని పుష్పపు త్రిశూలం, అమ్మవార్ల విగ్రహాలను శిరస్సుపై ధరించి మంగళవాయిద్యాల నడుమ ఆలయాల వద్దకు తరలివచ్చారు. పవిత్ర జలంతో అమ్మవారి ప్రతిమలకు అభిషేకం చేశారు.

గగుర్పొడిచే విన్యాసాలు

ఏటా ఉత్సవాలను పురస్కరించుకొని ఈ ప్రాంతంలోని యువకులు మొక్కులు తీర్చుకునే విధానం గగుర్పొడిచేలా ఉంటుంది. అగ్గి సట్టి తలపై తీసుకురావడం, నోటిలో శూలాలు గుచ్చుకోవడం, శరీరమంతా శూలాలు గుచ్చుకోవడం, వీపుకు, కాళ్లకు, చేతులకు ఇనుప కొక్కీలు పొడిపించుకొని వాహనాలకు వేలాడడం, వాహనాలను లాగడం తదితర పద్ధతుల్లో మొక్కులు చెల్లించుకున్నారు.



పవిత్ర జలాలు, అమ్మవారి విగ్రహాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

పౌష్టికాహారంపై అవగాహన

పుత్తూరు: వడమాలపేట మండలం ఎస్వీఆర్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం రాగిపిండితో లడ్డూ, బాలామృతంతో కుడుములు తయారు చేసుకునే విధానం చూపించారు. ఈనెలాఖరు వరకు ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మజ, సూపర్‌వైజర్లు రోజారమణి, పంచాయతీ కార్యదర్శి జోత్స్న దేవి, మహేశ్వరి, కల్పన, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాతమ్మ, లక్ష్మీదేవి, జయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ జయలక్ష్మి

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

కార్వేటినగరం : ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ పద్మసునంద కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం మండలాల్లో అంగన్‌వాడీ వర్కర్, మినీ వర్కర్, హెల్పర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.ఎస్‌ఆర్ పురం మండలంలో పెద్దకొడేపల్లె అంగన్‌వాడీ (ఓసీ), డీకే మర్రిపల్లె అంగన్‌వాడీ (ఎస్సీ), కొత్తపల్లెమిట్ట అంగన్‌వాడీ (ఎస్సీ) ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వెదుకుప్పంలో తంబలిమిట్ట మినీ అంగన్‌వాడీ (ఓసీ), ముత్తాలం మినీ అంగన్‌వాడీ (ఓసీ), కురివికుప్పం హెల్పర్ (ఓసీ), నచ్చుకూరు హెల్పర్ (ఎస్సీ), సీకే పురం హెల్పర్(బీసీ–డి) ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. కార్వేటినగరానికి సంబంధించి పద్మసరస్సు అంగన్‌వాడీ హెల్పర్ (ఎస్టీ), జగన్నాథపురం హెల్పర్ (ఎస్టీ), ఆర్కేవీబీపేట హెల్పర్ (బీసీ–బి) పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అర్హులైన వారు ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను కార్వేటినగరం ఐసీడీసీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నగరిలో..

నగరి : నింద్ర, విజయపురం మండలాలతోపాటు నగరి పట్టణంలోఇ ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ కె.కృష్ణవేణి కోరారు. నగరి మున్సిపాలిటీలో సత్రవాడ -1(బీసీ–బీ) అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, నింద్ర మండలం కీళంబాకం దళితవాడ (ఓసీ), శ్రీరామపురం ఎస్టీ కాలనీ (ఎస్టీ) మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, విజయపురం మండలంలో ఎల్లసముద్రం (బీసీ–డి) మినీ అంగన్‌వాడీ కార్యకర్త, శ్రీహరిపురం (బీసీ–డి) అంగన్‌వాడీ సహాయకుల పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధర నెల్లూరు : గంగాధర నెల్లూరు, పెనుమూరు, పాలసముద్రం మండలాల్లో ఒక అంగన్‌వాడీ, 2 మినీ అంగన్‌వాడీ, 10 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉనటు సీడీపీఓ వినత శ్రీ తెలిపారు. పెనుమూరు మండలం చిన్న కలికిరిలో మినీ అంగన్‌వాడీ (బీసీ– ఏ), పాళ్యం యానాది కాలనీలో మినీ అంగన్‌వాడీ (ఎస్టీ), ,పుట్టగానేపల్లెలో మినీ అంగన్‌వాడీ (ఓసీ), హెల్పర్ పోస్టులకు సంబంధించి గంగాధర్ నెల్లూరు మండలం అగరమంగళంలో (ఎస్సీ), కలిజ వేడు (ఓసీ), కె.వెంకటాపురం దళితవాడ (ఎస్సీ), కోటగారం దళితవాడ (ఎస్సీ), దాసరపల్లె (ఓసీ), తిరువీధి కుప్పం (ఓసీ), కట్ట కింద పల్లె దళితవాడ (ఎస్సీ), పాలసముద్రం మండలంలో బాలకృష్ణాపురం(ఓసీ), పెనుమూరు మండలంలో కె.గొల్లపల్లి (ఓసీ),నంజరపల్లె (ఓసీ) ఖాళీగా ఉన్నట్లు వివరించారు.